ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 8 సెప్టెంబరు 2025



అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎలిగేడు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాలలో మౌలిక వసతుల కల్పనతోపాటు అభివృద్ధిపై నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.

ఆదివారం శివపల్లి గ్రామంలో సుల్తానాబాద్ మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆ యా గ్రామాల్లో మిగిలిన పనులు, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాల కాంపౌండ్, వివిధ సంఘాల నూతనభవన నిర్మాణాలు, పలు అభివృద్ధి పనులపై ఆరా తీశారు. త్వరగా అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో శక్తికి మించి పనిచేసి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలని ఆయన కోరారు. నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మానేరు, గోదావరిలో ఇసుక లభ్యతపై సర్వే

- క్వారీలను లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నద్ధం
- పర్యావరణ అనుమతులతో క్వారీలు లీజుకు
- ఈ నెల 15వ తేదీ కల్లా పూర్తి కానున్న సర్వే
- అక్టోబరు 1వ తేదీన ప్రభుత్వానికి తుది నివేదిక



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల మానేరు, గోదావరి నదుల్లో ఇసుక లభ్యతపై సర్వే నిర్వహించి క్వారీలను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో తప్పులు జరిగినట్లుగా గాకుండా పక్కాగా పర్యావరణ అనుమతులు సాధించే విధంగా ఇసుక క్వారీలను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు కలెక్టర్ గనులు, భూగర్భ, నీటి పారుదల, సర్వే అండ్ ల్యాండ్స్, భూగర్భ జల, అటవీ, తదితర శాఖల అధికారులు కలిసి జాయింట్ సర్వే చేయాలని ఆదేశించారు. ఈనెల 15వ తేదీ వరకు సర్వే నివేదికలను అందజేయాలని, తుది నివేదికను అక్టోబర్ 1వ తేదీన రూపొందించి ప్రభుత్వానికి పంపించనున్నారు. జిల్లాకు ఓ వైపు.. గోదావరి, మరోవైపు.. మానేరు నదులు ఉన్నాయి. ఈ నదుల్లో ఇసుక లభ్యత బాగానే ఉంది. గతంలో మానేరు నదిపై సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, మంథని మండలాల పరిధిలో 21 ఇసుక క్వారీలను గుర్తించారు. కోటి 52 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడాలని నిర్ణయించి టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. దీనిపై ప్రజల నుంచి వ్యతిరేకత రావడం, మానేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ కోర్టులో కేసు వేశారు. పర్యావరణ అనుమతులు లేకుండానే ఇసుక క్వారీలను నిర్వహిస్తున్నారని, ఇసుకను తోడడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోవడమే గాకుండా, వాహనాల రాకపోకల వల్ల రోడ్లు దెబ్బతినడం, దుమ్ము ధూళితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, ఇసుక క్వారీల నుంచి ఇసుకను తోడడాన్ని నిలిపి వేయాలని కోర్టును కోరారు. క్వారీలు నిలిపివేసే నాటికి సుమారు 70 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించారు. కోర్టు ఆదేశాలతో కొద్ది రోజులు తాత్కాలికంగా క్వారీలను నిలిపివేశారు. మొత్తానికే క్వారీలను మూసి వేయాలని కోర్టు తీర్పును వెలువరించింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తీసుక వచ్చింది. మానేరుకు అవతలి పక్కన గల కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో గల ఇసుక క్వారీలు నడుస్తున్నాయి. పెద్దపల్లి జిల్లా వైపునకు గల క్వారీలు నడవనీయకుండా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అడ్డుపడ్డారు. మానేరు ఇసుక క్వారీల కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ల కాల పరిమితి కూడా పూర్తయ్యింది. హైదరాబాద్‌లో ఇసుక డిమాండ్ బాగా ఉంది. జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల వైపు ఉన్న ఇసుక క్వారీల వద్ద మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం వరకు ఇసుక లారీలు నిలిచిపోతున్నాయి. రెండు, మూడు రోజులైన లోడింగ్ కాని పరిస్థితి ఉంది. హైదారాబాద్‌లో మానేరు ఇసుకకు డిమాండ్ బాగానే ఉంది. అలాగే అప్పటికే జిల్లాలో నడుస్తున్న స్యాండ్ ట్యాక్సీ పాలసీకి

(మిగతా 8వ పేజీలో)

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



సెంటినరీకాలనీలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రామగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర వస్తువుల ఆర్థిక భారం తగ్గించేందుకు చేపట్టిన నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రధాన మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నిత్యావసర వస్తువుల పై జీఎస్టీని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ సెం టినరీకాలనీలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల ప్రధాన కార్యదర్శి తొట్లరాజు, ఉపాధ్యక్షుడు నాంసాని మహేష్, పట్టణ అధ్యక్షుడు చిదురాల శివప్రసాద్, మహిళా అధ్యక్షురాలు రొడ్డ వరలక్ష్మి, నాయకులు ఎం.డి జానీ, గనిరెడ్డి నాగరాజు, క్రాంతికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు ఆదివారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జీఎస్టీ విధానంలో మార్పులు చేయడం వల్ల ఎంతో మంది నిరుపేదలకు ఉపయోగంగా మారుతున్నదని వారు హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద, మధ్యతరగతి బతుకులు బాగుపడాలంటే బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగర వేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, సీనియర్ నాయకులు మట్ట శంకర్, జంగపల్ల అజయ్, మల్లారపు అరుణ్ కుమార్, పంతకాని విశ్వతేజ, కొమ్ము శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, అగ్గి శ్రవణ్, మేదర్ లింగస్వామి, ఆసం శ్రీనివాస్, గొట్టె సంపత్, తూండ్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



కమాన్‌పూర్‌లో పాల్గొన్న నాయకులు

తుది దశకు సమీకృత మార్కెట్

- హోల్‌సేల్, రిటైల్, మాంసపు మార్కెట్ల నిర్మాణం
- ప్రత్యేకంగా రైతుబజార్
- వ్యాపారులకు క్యాంటీన్ సౌకర్యం
- కార్యక్రమాల నిర్వహణకు 'కమ్యూనిటీ హాల్'



మార్కెట్‌లోని షాపులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని హాస్పిటల్ ఏరియాలో ఆధునిక వసతులతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. 3.12ఎకరాల విస్తీర్ణంలో రూ.5కోట్లతో మార్కెట్ నిర్మాణం జరుగుతుంది. ఒకే చోట కూరగాయలు, మటన్, చికెన్, ఫిష్ మార్కెట్లు, రైతు బజార్ నిర్మాణం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ పనులు చేయిస్తుంది. రాష్ట్రంలో లక్ష జనాభా దాటిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో సమీకృత మార్కెట్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా రామగుండంలో రూ.5కోట్లతో మార్కెట్ నిర్మాణానికి మంజూరు లభించింది.

మార్కెట్, రైతుబజార్ ఒకే కాంప్లెక్స్‌లో...

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో తూర్పు ప్రాంతంగా పేరున్న జవహర్‌నగర్, తిలక్‌నగర్, ఫైవింక్లయిన్, విఠల్‌నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 70వేల జనాభాకు సౌలభ్యంగా ఈ మార్కెట్‌ను ప్రతిపాదించారు. ఇందుకుగాను సిక్ హాస్పిటల్ వెనుక ఉన్న సింగరేణి సంస్థకు చెందిన 3.12ఎకరాల స్థలాన్ని ఈ మార్కెట్‌కు కేటాయించారు. సీఎంఏ గ్రాంట్‌లో రూ.5కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ప్రత్యేకంగా హోల్‌సేల్, రిటైల్ కూరగాయల మార్కెట్లు, మటన్, చికెన్, ఫిష్ మార్కెట్, రైతు బజార్‌లు నిర్మించారు. రెండు అంతస్తుల్లో 28 హోల్ సేల్ షాపులు, వృత్తాకార మార్కెట్‌లో 16 నాన్‌వెజ్ షాపులు, 16 రిటైల్ కూరగాయాల షాపులు, 16 షాపులు రైతు బజార్ షాపులు నిర్మించారు. మొత్తంగా 76షాపులతో మార్కెట్ నిర్మాణం జరిగింది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఆధునిక సౌకర్యాలతో నిర్మిస్తున్నారు. రైతులు, వ్యాపారులు, ప్రజల సౌకర్యార్థం క్యాంటీన్, బాత్ రూమ్‌లు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. వ్యాపారుల అవసరాల నిమిత్తం కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. మార్కెట్ అంతా టైల్స్, ఎక్కడికక్కడ నీటి సౌకర్యం కల్పించారు.

పూర్తి కావస్తున్న నిర్మాణం...

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎట్టకేలకు పూర్తి కావస్తుంది. 2019లో సీఎంఏ గ్రాంట్‌లో పనులు మొదలుపెట్టి కరీంనగర్‌కు చెందిన పీడీఆర్ కన్‌స్ట్రక్షన్‌కు అగ్రిమెంట్ చేశారు. బిల్లుల పెండింగ్‌లతో జాప్యం ఏర్పడింది. ప్రస్తుత శాసనసభ్యుడు రాజ్ ఠాకూర్ బాధ్యతలు స్వీకరించిన తరువాత మార్కెట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఆర్‌అండ్‌బీపై ఒత్తిడి తెచ్చారు. నిర్మాణం తుదిదశకు చేరుకుంది. రిటైల్ మార్కెట్‌లో పైకప్పురేకులు, ఫ్లోరింగ్, పెయిం టింగ్, సీసీరోడ్డు పనులు మిగిలి ఉన్నాయి. నెల రోజుల్లో పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. విఠల్‌నగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో పాటు ఎన్‌టీఆర్‌నగర్‌లో నిర్మిస్తున్న మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావిస్తుంది.

గోదావరిఖనిలో మున్సిపల్ మార్కెట్‌తోపాటు సీఎస్‌పీ కాలనీ, గౌతమినగర్, ఎన్‌టీపీసీ, రామగుండంలలో వీక్లి మార్కెట్లు మాత్రమే కొనసాగుతున్నాయి. అదనంగా విఠల్‌నగర్, ఎన్‌టీఆర్‌నగర్‌లలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, గోదావరిఖని బస్టాండ్ వద్ద హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. ఎన్‌టీపీసీ, ఫైటింక్లయిన్‌కాలనీ, రామగుండాల్లో అక్కడి జనాభా కు అనుగుణంగా ఆధునిక వసతులతో డైలీ మార్కెట్ల నిర్మాణం జరుపాలనే యోచనలో కార్పొరేషన్ ఉంది.

రైతుల బారులు... అందని యూరియా..

- ఆందోళనలో అన్నదాతలు
- మండలంలో 757 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ
- మరో 200 మెట్రిక్ టన్నుల యూరియాకు ప్రతిపాదనలు



కన్నాలలో యూరియా కోసం బారులు తీరిన రైతులు(ఫైల్)

పాలకుర్తి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూరియా దొరకక రైతులు ఆందోళన చెందుతున్నారు. పొద్దంతా పీఏసీఎస్‌ల వద్ద బారులుదీరినా యూరియా దొరకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం రైతులకు సరిపడ యూరియా నిలువలు ఉన్నాయని ప్రకటనలు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 3,341 ఎకరాల్లో రైతులు పత్తి, సుమారు 8,500 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. రైతులకు 957 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు కన్నాల ప్రాథమిక సహకార సంఘం కేంద్రం నుంచి 392 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని, మరో 221 మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

పుట్నూర్ డీసీఎంఎస్ నుంచి 165 మెట్రిక్‌టన్నులు సరఫరా చేయగా మరో 80 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమున్నదని, కుక్కలగూడూర్ పీఏసీఎస్ ద్వారా 60 మెట్రిక్‌టన్నులు అందించగా మరో 40మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. ఈసాలతక్కళ్లపల్లి పీఏసీఎస్ నుంచి 140 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయగా మరో 80 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. రైతులు ప్రస్తుత అవసరం మేరకే యూరియాను కొనుగోలు చేయాలని, యూరియా దొరుకుతుందో లేదో అనే ముందుచూపుతో నిల్వచేస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఆయా కేంద్రాలవద్ద యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. ఇటీవల ఆయా కేంద్రాలకు ఒక్కొక్క లోడు యూరియా రావడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడటంతో కాసేపు తోపులాట చేసుకుంది. రోజులతరబడి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నామని, అయినా యూరియా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరికి రెండు బస్తాల చొప్పున ఇవ్వడంతో అవి సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

యూరియా కోసం ప్రతిపాదనలు పంపాం

బండి ప్రమోద్ కుమార్ మండల వ్యవసాయ అధికారి



మండలంలో సాగుకు సరిపడ యూరియాను రైతులకు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు మండలంలో 757 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని, మరో 200 మెట్రిక్ టన్నుల యూరియా కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. రైతులు పత్తి,వరికి మూడు నుంచి నాలుగు సార్లు యూరియాను వేస్తున్నారని తెలిపారు. రైతులు నానో యూరియాను ఉపయోగించా లన్నారు. నానో ఎరువుల వాడకం వల్ల రైతులకు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట దిగుబడికి ఉపయోగపడుతుందని సూచించారు.

చంద్రగ్రహణం ఎఫెక్ట్

ఆలయాల మూసివేత



ఓదెల మల్లన్న ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు



ఆదివరాహ స్వామి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

ఓదెల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం అర్చకులు భ్రమరాంభ మల్లికార్జున స్వామి క్షేత్రాన్ని మూసివేశారు. చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం ఉదయం 11.30 గంటల నుంచి ఆలయ దర్శనాలను బంద్ చేశారు. తిరిగి సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయం సంప్రోక్షణ అనంతరం నిత్యాభిషేకం తరువాత భక్తులకు ప్రవేశం ఉంటుందని ఈవో సదయ్య తెలిపారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పుణ్య క్షేత్రమైన ఆదివరాహ స్వామి ఆలయాన్ని అర్చకులు ఆదివారం మూసి వేశారు. చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయాన్ని మూసివేయగా మళ్లీ సోమవారం ఉదయం తెరవనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. పలు గ్రామాల్లోగల ఆలయాలను పండితులు మూసివేశారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాలను చంద్రగహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం పూజారులు మూసి వేశారు. రాత్రి గ్రహణం కావడంతో మధ్యాహ్నం ఆలయాల్లో సాయంత్రం, రాత్రి నిర్వహించే కార్యక్రమాలను పూర్తి చేసుకొని ఆలయాలను మూసి వేశారు. దీంతో పట్టణంలోని గణపతి, శివాలయాలు, వైష్ణవ, అమ్మవారి, హనుమాన్, అయ్యప్ప, సాయి, దత్త, బ్రహ్మంగారి ఆలయాలు మూసి వేశారు. సోమవారం ఉదయం ఆలయాల్లో సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

మోదీ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను తిప్పికొట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కే సూర్యం

గోదావరిఖని, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మోదీ కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్‌ను తిప్పికొట్టాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కే సూర్యం పిలుపునిచ్చారు. ఆదివారం ఖనిలో టీయూసీఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు తోకల రమేష్ అధ్యక్షతన జరిగింది. సూర్యం మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ యథేచ్ఛగా కార్మిక వ్యతిరేకవిధానాలను అమల్లోకి తీసుకొస్తున్నారని, 44 కార్మిక చట్టాలను నాశనం చేసి కేవలం పారిశ్రామికవేత్తలు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను ఆమోదించారన్నారు పని గంటల పెంపు కార్మికవర్గానికి ప్రమాదకరమని, వాటి ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం 12గంటల పని 282జీఓను అమల్లోకి తీసుకు వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోదీకి వ్యతిరేకంగా మాట్లాడుతూ అవే విధానాలను ఆమోదించడం సరైనది కాదన్నారు. సులభతరమైన వ్యాపార విధానాలను కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన దానిని కేసీఆర్, రేవంత్‌రెడ్డి అమలు చేశారన్నారు. పాశమైలారం శిగాచి పరిశ్రమలో 56మంది కార్మికులు ఆహుతి అయ్యారని, సిగాచి పరిశ్రమకు ఎలాంటి ప్రమాదం లేదని ఫ్యాక్టరీ అధికారులు సర్టిఫై చేయడం సిగ్గుచేటన్నారు. కార్మిక వర్గానికి సామాజిక భద్రతా కింద వచ్చిన పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను యాజమాన్యాలు నిరాటంకంగా ఉల్లంఘిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో తీర్పు ఇచ్చిందని, 9సంవత్సరాలు గడుస్తున్నా అతీగతీలేదన్నారు. చాలీచాలని జీతాలతో జీవిస్తున్న శ్రామిక వర్గానికి సరైన వేతనాలులేక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, 73షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ జీవోలను ప్రభుత్వం ఎందుకు సవరించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎదుర్కొంటున్న కార్మిక వర్గ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. నాయకులు ఈసంపల్లి రాజేందర్, గొల్లపల్లి చంద్రయ్య, ఆడెపు శంకర్, మార్త రాములు, గూడూరి వైకుంఠం, కలువల రాయమల్లు, పుల్లూరి నాగభూషణం, తూళ్ళ శంకర్, చిలుక రాజు, మాటేటి పోషం, మాట్ల సమ్మయ్య పాల్గొన్నారు.

కిటకిటలాడిన మాంసం, మద్యం దుకాణాలు



చికెన్ షాపు వద్ద జనం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం, గణేష్ నవరాత్రుల సందర్భంగా వెలవెల బోయిన మాంసం, మద్యం దుకాణాలు ఆదివారం కిటకిటలాడాయి. గోదావరిఖని పట్టణంలోని చికెన్, మటన్ మార్కెట్‌లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల మాంసం దుకాణాల వద్ద వినియోగదారులు మాంసం కొనుగోలు కోసం క్యూలు కట్టారు. ఉదయం7గంటల నుంచే చికెన్, మటన్, ఫిష్ మార్కెట్‌లలో పెద్ద ఎత్తున జనం కొనుగోలు కోసం వచ్చారు. 40రోజుల పాటు శ్రావణమాసం, గణేష్ నవరాత్రులు రావడంతో చాలా మంది మాంసం, మద్యానికి దూరంగా ఉన్నారు. నవరాత్రులు ముగియడంతో దుకాణాల వద్ద బారులు తీరారు. నిన్నటి వరకు రూ.180లకు కిలో చికెన్ ఉండగా, ఆదివారం రూ.240లకు చేరుకుంది.

అక్టోబర్ 3న దసరా సెలవు ప్రకటించండి

గోదావరిఖని, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో అక్టోబర్ 3న దసరా పండుగ సెలవు ప్రకటించాలని సింగరేణి సీఎండీకి ఆగస్టు 9న లేఖ రాశామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి, దసరా పండుగలు ఒకే రోజు రావడం వల్ల కార్మికులు ఇబ్బంది పడుతారన్నారు. దీనిపై సీఎండీ, డైరెక్టర్(పా)లతో చర్చించగా రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 3న దసరా సెలవు ప్రకటిస్తే సింగరేణిలో కూడా అమలు చేస్తామని చెప్పారని, కానీ ఏఐటీయూసీ ప్రభుత్వ ప్రకటనతో సంబంధం లేకుండా సెలవు ప్రకటించాలని డిమాండ్ చేసిందని, అదేవిధంగా కార్మికులు పండుగ సెలవు కోల్పోయి నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.

క్రేన్ ఆపరేటర్‌ను చితకబాదిన సీఐ

- వినాయక నిమజ్జనం రోజున ఘటన
- విచారణ జరుపుతామన్న రామగుండం పోలీస్ కమిషనర్

6

ఉరి వేసుకొని వృద్ధుడి బలవన్మరణం

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామానికి చెందిన అరబాటు గోపాల్‌రావు(68) ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోపాల్‌రావు-శకుంతల దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారందరికీ ఘనంగా వివాహం జరిపించారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాడు. దీంతో తీవ్రమనస్థాపానికి గురైన గోపాల్‌రావు గ్రామశివారులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఫైర్‌మన్ మృతి


మనోహర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగి ఈ నెల 1న ఆత్మహత్యయత్నం చేసిన చొప్పదండి ఫైర్‌మెన్ మనోహర్(32) ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన జి మనోహర్ చొప్పదండి ఫైర్ స్టేషన్‌లో ఫైర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గడ్డిమందుతాగిన అతనే తన స్నేహితులకు సమాచారం అందించగా వారు అదేరోజు అతన్ని కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కడుపునొప్పి భరించలేకనే గడ్డిమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

దుబాయ్‌లో గుండెపోటుతో బొంకూర్ వాసి మృతి


స్వామి(ఫైల్)

గొల్లపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో గుండెపోటుతో గొల్లపల్లి మండలం బొంకూర్ గ్రామానికిచెందిన సాంబారి స్వామి (55) అనేవ్యక్తి శనివారం మృతిచెందాడు. గ్రామస్థులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపల్లి మండలం బొంకూర్‌కు చెందిన స్వామి పదిసంవత్సరాల నుంచి ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్తున్నాడు. కంపెనీలో పనిముగించుకొని తనగదికి చేరుకున్న స్వామికి హఠాత్తుగా గుండెపోటు రావడంతో శనివారం మృతిచెందినట్లు స్వామి మిత్రులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. స్వామి మృతదేహాన్ని త్వరితగతిన స్వగ్రామానికి తరలించాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని పోతారంలో గ్రామంలో మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కట్కూరి లక్ష్మి అనే మహిళ తన ఇంటి వద్ద మరో మహిళతో ఆదివారం తమ మహిళా సంఘం గురించి మాట్లాడుతుండగా లక్ష్మిపై ఆమె బావ కట్కూరి రవీందర్ దాడి చేసినట్లు పేర్కొన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'పీఎంశ్రీ'తో పాఠశాలలకు మహర్దశ

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు
- రూ.14.5 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు
- ఆట వస్తువులు, డిజిటల్ లైబ్రరీకి ప్రత్యేక నిధులు
- విహార యాత్రలకు విద్యార్థులకు అవకాశం


పీఎంశ్రీ కింద ఎంపికైన పోతారం పాఠశాల

కథలాపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో కార్పొరేట్ స్థాయిని తలపించేలా విద్యార్థులకు విద్య అందించాలనే సంకల్పంతో జగిత్యాల జిల్లాలో నాలుగు ప్రభుత్వ పాఠశాలలను ప్రైమినిస్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద ఎంపిక చేశారు. మెట్‌పల్లిలోని డీడీనగర్, బీర్‌పూర్, కొడిమ్యాల మండలం రాంసాగర్, కథలాపూర్ మండలం పోతారం ప్రాథమిక పాఠశాలలను పీఎంశ్రీ కింద ఎంపిక చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రీప్రైమరీతో పాటు ప్రైమరీ స్థాయిలో పాఠశాలను అందంగా ఆకర్షణీయంగా రూపొందించి చిన్నారులను బడిలో చేర్పించేలా తీర్చిదిద్దారు.

● ప్రత్యేక నిధులతో పాఠశాలలకు ఆకర్షణ

పీఎంశ్రీ పథకంలో భాగంగా ప్రీప్రైమరీ కోసం ఐదేళ్లలోపు చిన్నారులను ఆటలతో చదువు వైపు దృష్టి సారించేలా చేయడానికిగాను ఆట వస్తువులకు రూ.2 లక్షలు కేటాయించారు. ప్రత్యేకంగా చిన్నారులు కూర్చునేందుకు డెస్కులు సరఫరా చేశారు. చిన్నారుల్లో పఠనాసక్తిని పెంచడానికి రూ.50 వేలు కేటాయించగా తరగతి గదుల గోడలపై రంగు రంగుల బొమ్మలు వేయించారు. ప్రతీ ఏటా ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు వార్షికోత్సవం, స్కూల్‌డే నిర్వహణతో పాటు విజ్ఞానయాత్రలకు అవకాశం కల్పించారు. సాలార్‌జంగ్ మ్యూజియం, జూపార్క్, పలు బహుళార్థక సాధక ప్రాజెక్టుల సందర్శన చేయాలనే నియమాలు విధించారు. దీంతో విద్యార్థుల్లో చదువుతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరగడానికి అవకాశం ఉంది. ఇతర పాఠ శాలల్లో విద్యార్థులతో మమేకం కావడానికి ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ పేరిట సందర్శన చేస్తున్నారు. డిజిటల్ లైబ్రరీ నిర్మాణం కోసం రూ.14.5 లక్షల నిధులు విడుదల చేయగా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. లైబ్రరీ గ్రాంట్ ప్రత్యేకంగా కేటాయించగా దిన పత్రికలు, పక్షపత్రికలు, పంచతంత్రం, చెలిమి వంటి కథల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. కంప్యూటర్లు మంజూరు చేయగా వాటిని విద్యార్థులకు వివిధ రకాల పాఠ్యాంశాల బోధనకు ఉపయోగిస్తున్నారు. పాఠ శాల ఆవరణలోకి అడుగుపెడితే పూర్తిగా కార్పొరేట్‌ను తలదన్నేలా కనిపిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటోంది.


ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు

కార్పొరేట్ వసతులతో నాణ్యమైన విద్య
-శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, పోతారం



జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన నాలుగు పాఠశాలల్లో మండలంలోని పోతారం ఉంది. నాలుగేళ్ల కాలపరిమితికి గాను 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాల వాటా కింద నిధులు వెచ్చించారు. ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఆట వస్తువులతో సహా అన్నీ కొనుగోలు చేశాం. పాఠశాల గోడలకు వివిధ రకాల రంగులు వేయడంతో చిన్నారులు చదువుపై ఆసక్తి పెంచుకోవడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు


స్వర్ణలత(ఫైల్)

శంకరపట్నం, సెప్టెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): ఓ యువతి అదృశ్యమైనట్లు కేశవ పట్నం పోలీస్‌స్టేషన్లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన పూదరి స్వర్ణలత గత నెల22న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వాకబు చేసిన ఎలాంటి సమాచారంలేదు. దీంతో స్వర్ణలత తండ్రి పూదరి సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9963239915, 8712670774 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

వివాహిత అదృశ్యం

కొడిమ్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామానికి చెందిన చెరవేని సుమలత అనే వివాహిత అదృశ్యం అయినట్లు శనివారం రాత్రి కొడిమ్యాల పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నల్లగొండగ్రామానికి చెందిన సుమలత ఆమె భర్త రమేష్‌తో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో చెప్యాల గ్రామానికి చెందిన సుమలత తండ్రి నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు కొడిమ్యాల ఎస్సై సందీప్ 8712656831నంబర్‌కు తెలపాలని కోరారు.

బాణాసంచా పేలి యువకుడికి గాయాలు

మల్లాపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ముత్యంపేటలో ఆదివారం జరిగిన వినాయకనిమజ్జన వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. శోభాయాత్రలో బాణాసంచాపేల్చగా చిట్యాల అరవింద్(22) అనేయువకుడి మీదపడి కళ్లకు తీవ్రగాయాలయ్యాయి. అరవింద్‌ను చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

క్రేన్ ఆపరేటర్‌ను చితకబాదిన సీఐ

● వినాయక నిమజ్జనం రోజున ఘటన ● విచారణ జరుపుతామన్న రామగుండం పోలీస్ కమిషనర్


బాధితుడు శ్రావణ్ కుమార్

కోల్‌సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనం సందర్భంగా ఓ పోలీసు అధికారి ప్రవర్తన చర్చనీయాంశంగా మారింది. ఖని సమీపంలోని గోదావరి నదిలో సింగరేణి, రామగుండం నగరపాలక సంస్థ సహకారంతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన గణపతులను నిమజ్జనం చేశారు. ఈ నెల 5వ తేది నుంచి నిమజ్జనం జరుగుతుండగా కార్పొరేషన్, సింగరేణి ఉద్యోగులు షిఫ్టుల వారీగా డ్యూటీలు చేస్తున్నారు. శనివారం రాత్రి జీడీకే 11ఇంక్లైన్‌కు చెందిన ఎంవీ ఆపరేటర్ గండు శ్రావణ్ కుమార్‌కు గోదావరి వంతెన వద్ద ఎస్కార్ట్ క్రేన్‌తో నిమజ్జనం చేయించేందుకు డ్యూటీ కేటాయించారు. 4వ నెంబర్ ప్లాట్‌ఫాం వద్ద శ్రావణ్‌కుమార్ క్రేన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అతనితోపాటు సీనియర్ సర్దార్ చిగుడి సాయి చరణ్, ఉద్యోగులు బండి నరేష్, గుండేటి మహేష్‌లకు విధులు కేటాయించారు. రామగుండం కార్పొరేషన్ నుంచి చెరుకు శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్ విధులు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో రద్దీ పెరిగింది. నిమజ్జనానికి వచ్చిన వాహనానికి సంబంధించి ఫ్రేమ్‌లు ఉండడంతో వాటిని తొలగించాలని నిర్వాహకులకు సూచించారు. సమయం ఉండడంతో శ్రావణ్‌కుమార్ మూత్ర విసర్జన కోసం క్రేన్ దిగాడు. ఆ సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న చెన్నూరు రూరల్ సీఐ బన్సీలాల్ క్రేన్ ఎందుకు దిగావంటూ శ్రావణ్‌కుమార్‌ను గద్దించాడు. తాను సింగరేణి ఉద్యోగినని, బాత్ రూమ్‌కు వెళ్లివస్తానని చెబుతున్నా వినకుండా చేయిచేసుకున్నాడని, మళ్లీ క్రేన్ ఎక్కేందుకు వెళుతుండగా మరోమారు కొట్టినట్టు బాధితుడు పేర్కొంటున్నాడు. తోటి ఉద్యోగులు సైతం అకారణంగా దూషిస్తూ చేయి చేసుకొన్నాడని పేర్కొన్నారు. దీంతో శ్రావణ్‌కుమార్ అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై సింగరేణి జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

● ఘటనపై విచారణ జరుపుతాం..
- సీపీ అంబర్ కిశోర్ ఝా

సింగరేణి, మున్సిపల్‌కార్పొరేషన్, పోలీసులు, ప్రభుత్వశాఖల సమన్వయంతో గణపతి నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి ఘటనలు జరగలేదు. నిమజ్జనంపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టాం. గోదావరి వంతెన వద్ద ఏంజరిగిందనే విషయమై విచారణ జరుపుతాం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

● ఒకరిపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం మద్దిమల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామ వాసి మాలోతు రాజిరెడ్డి తీవ్రగాయాల పాలయ్యాడని ఎస్ఐ లక్ష్మణ్ ఆదివారం రాత్రి తెలిపారు. గ్రామంలోని మాలోతు రాజిరెడ్డి తన ద్విచక్రవాహనంపై వెళుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మాలోతు లక్‌పతి తన బైక్‌తో ఢీకొట్టాడని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లక్‌పతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వినాయక నిమజ్జన వేడుకల అనంతరం గ్రామ శివారులో యువకులు ఆదివారం విందులు చేసుకున్నారు. ఇరు వర్గాల నడుమ మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడికి దిగారు. యువకుల గొడవ తారస్థాయికి చేరుకోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలను శాంతింపజేశారు. స్వల్ప గాయాల పాలైన యువకులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఏడుగురిపై అదనపు వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తన భర్త అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నాడని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన మౌనికకు కొత్తపల్లికి చెందిన మిడిదొడ్డి శివాజీతో 2021లో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.6లక్షల నగదు, ఆరు తులాల భంగారం, ఇతర పెట్టు పోతలు పెట్టారు. పెళ్లి తర్వాత ఏడాది పాటు కలిసి మెలిసి ఉన్నారు. తర్వాత నుంచి శివాజీ ప్రతిరోజు తాగి వచ్చి అదనపు వరకట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేసేవాడు. భర్తతో పాటు అత్త చిలుకమ్మ, మామ రాజయ్య, బావ శంకర్, యారాలు సంధ్య, ఆడపడుచు స్రవంతి, ఆమె భర్త రంజిత్ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బోయినపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మల్లేశం ఆదివారం తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని రామన్నపేట చెందిన రాజిరెడ్డి, కోదురుపాకకు చెందిన సంజీవరావు సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొడగాని వెంకటేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ కుమార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఏనుగుల ప్రశాంత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి, అమ్మిగల్ల గోపాల్, మొగుళోజి శ్రీకాంత్, నక్క శ్రీకాంత్, గుంటి జలందర్, ఏమిరెడ్డి దిలీప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ


కిషన్‌రావుపేటలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మల్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమిసందర్భంగా ఆదివారం కొండగట్టు అంజనేయస్వామి గిరుల చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధానార్చకులు సురేశ్‌ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గిరిప్రదక్షిణకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చారు. గిరిప్రదిక్షణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

వెల్గటూర్: వెల్గటూర్ మండలంలోని కిషన్‌రావుపేట శ్రీ నాగపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం గిరిప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

అనంతరం స్వామివారి చిత్రపటాన్ని అందంగా అలంకరించి శావపై నిలిపి అంగరంగ వైభవంగా గిరిప్రదక్షిణ నిర్వహించారు. కిషన్‌రావుపేట, పరిసర గ్రామాల భక్తులు స్వామి వారి గోవింద నామాలు జపిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


కొండగట్టులో స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు

సుందిల్లలో వ్యక్తిపై కత్తిపోట్లు..

ఏడాదిలో రెండోసారి హత్యాయత్నం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుందిల్ల పంచాయతీ పరిధిలోని గడ్డంపల్లెలో ఆదివారం రాహుల్‌రాజ్(38) కత్తిపోట్లకు గురయ్యాడు. చొప్పరి లక్ష్మణ్ కత్తితో రాహుల్‌రాజ్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు రాహుల్ రాజ్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా లక్ష్మణ్, రాహుల్ రాజ్‌ల మధ్య నెలకొన్న విభేదాలు దాడికి కారణమని తెలుస్తున్నది. హత్యాయత్నం చేసిన లక్ష్మణ్ తన అవసరం కోసం రాహుల్‌రాజ్ వద్ద ఏడాదిక్రితం రూ.1లక్ష అప్పు తీసుకున్నాడు. డబ్బులు తిరిగి చెల్లించాలని రాహుల్‌రాజ్ ఒత్తిడి చేయడంతో గతేడాది జూలై 12న రాహుల్ ఇంటికివెళ్లిన లక్ష్మణ్.. అతడిపై గొడ్డలితో దాడిచేశాడు. అప్పుడు రాహుల్‌రాజ్ స్వల్పగాయాలతో తప్పించుకొన్నాడు. ఆ హత్యాయత్నం కేసు కోర్టులో నడుస్తున్నది. మళ్లీ ఆదివారం రాహుల్‌రాజ్‌పై కత్తితో దాడికిపాల్పడగా తీవ్ర గాయాలయ్యాయి.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు రావాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన పింఛన్ రీయింబర్స్‌మెంట్ డబ్బులు విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో అనేక సంఘాలతో ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికైనా కళ్లు తెరిచి పోరుబాట పట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఆర్థిక అంశాలపై దృష్టి సారించి అన్నింటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా మాజీఅధ్యక్షుడు జాలి మహేందర్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు బొంగోని పరుశురాం, ఊకంటి సంపతికుమారి, గంట్ల నరసింహారెడ్డి, సంది మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతి, మహాసభ పటిష్టానికి కృషి

● ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్యవైశ్యుల అభ్యున్నతికి, పేద వైశ్యులకు చేయూత అందించడంతోపాటు తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ పటిష్టతకు పాటుపడతామని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. కరీంనగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఉత్తర తెలంగాణ జిలాల మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు, బాధ్యుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇటీవల కొంతమంది మహాసభలో ఓటు హక్కు లేకపోయినా సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టింగులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాంటివారిని ఉపేక్షించబోమన్నారు. ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి ప్రతీఒక్కరు కృషిచేయాలని స్పష్టం చేశారు. రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో ఆర్యవైశ్యులు సత్తాచాటాలన్నారు.

ఆర్యవైశ్యులంతా ఐక్యతగా ఉంటే నే స్థానికసంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ప్రాధన్యమిస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వైశ్యులకు స్థానికసంస్థల ఎన్నికలతోపాటు నామినేటెడ్ పదవుల్లో అన్ని పార్టీలు ప్రాధాన్యత నివ్వాలని కోరారు. అధ్యక్షత వహించిన కరీంనగర్ జిల్లా మహాసభ అధ్యక్షుడు కన్న కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ జిల్లాల ప్రతినిధులంతా ఏకతాటిపై ఉంటే మహాసభ రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టేందుకు వీలుటుందని, అందరం కలిసికట్టుగా ఉండాల్సి అవసరం ఉందన్నారు. మహాసభకు విరుద్ధంగా ఎవరు మాట్లాడినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యక్రమంలో నాయకులు నలుమాచు కాంతయ్య, వందేటి అశోక్, ముక్త శ్రీనివాస్, గణేష్, పడకంటి శ్రీనివాస్, తొడుపునూరి కరుణాకర్, చిదుర సురేష్, కొమురవెల్లి వెంకటేశం, శివనాథుని శ్రీనివాస్, అరిగి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్గించిన జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన కోమాకుల సాయి, కోమాకుల సామంత్, భోదారపు విష్ణు, భోదారపు గోవర్ధన్‌తో పాటు మరికొంతమంది యువకులు రూరల్ స్టేషన్‌లో పనిచేస్తున్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్గించి, అతడిని దుర్భాషలాడి దూషించినట్లు ఎస్సై సధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 100కు డయల్ రాగానే స్పందించిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ టీఆర్‌నగర్‌కు చేరుకున్నాడు. సమస్యను అడిగి వివరాలను సేకరిస్తున్న క్రమంలో కానిస్టేబుల్‌పై యువకులు విధులకు ఆటంకం కల్గించి, దుర్భాషలాడారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురిమిండ్ల శ్రీనివాస్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి గర్భవతిని చేశాడు. బాలిక పెళ్లి చేసుకోవాలని శ్రీనివాస్‌ను అడుగగా పెళ్లి చేసుకోనేది లేదు చంపుతనాని బెదిరించాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

దళితుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం

● బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణలో

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



లక్ష్మీపూర్‌లో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

రామడుగు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దళిత సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ ధ్యేయమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులను అన్నివిధాలుగా ఆదుకోవడమే తమ అభిమతమని అన్నారు. దళితులకు ఎలాంటి సమస్యలున్నా కమిషన్ దృష్టికి తీసుకువస్తే తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణకు తాను ముఖ్యఅతిథిగా రావడం ఇదే మొదటిసారి అని ఆనందాన్ని వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని కోరారు. అలాగే బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, నిర్వాహకులు డీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కనకం వంశీ, గనుకుల లక్ష్మణ్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

మల్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్‌రోడ్డు సమీపంలోని నూకపల్లికి వెళ్లే మార్గం దగ్గర ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదంలో నూకపల్లికి చెందిన సుద్దాల నర్సయ్య, కేసీఆర్‌కాలనీకి చెందిన నాజాల్దిన్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్సకోసం జగిత్యాలకు తరలించగా పోలీసులు వివరాలు నమోదు చేశారు.

నత్తనడకన పంచాయతీ భవనాల నిర్మాణాలు

- జగిత్యాల జిల్లాకు కొత్తగా 81 భవనాలు మంజూరు
- 42 గ్రామాల్లో ప్రారంభానికి నోచుకోని పనులు
- పూర్తయింది ఒక్క చోట మాత్రమే
- పట్టించుకోని ఉన్నతాధికారులు



పెగడపల్లి మండలం నామాపూర్‌లో అర్ధాంతరంగా నిలిచిన జీపీ భవన నిర్మాణ పనులు

జగిత్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో పలు గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన తండాలు, అనుబంధ గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో జిల్లాలో పంచాయతీల సంఖ్య 325 నుంచి 385కు చేరుకుంది. జిల్లాలోని పలు చోట్ల తాత్కాలికంగా అద్దె భవనాల్లో, ప్రభుత్వ పాత మహిళా మండలి భవనాల్లో కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఇందులో పాత గ్రామ పంచాయతీలకు కొన్నింటికి సొంత భవనాలు ఉన్నాయి. ఇందులో కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉండగా మరికొన్ని ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా ప్రభుత్వం యేడాది క్రితం పంచాయతీలకు సొంత భవనాలను నిర్మించడానికి అవసరమైన నిధులను విడుదల చేసింది. ఉపాధిహామీ పథకం కింద రూ.16.16 కోట్ల నిధులు కేటాయించింది. పనులను పంచాయతీరాజ్ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గడువు పూర్తయినా ఇప్పటి వరకు కొన్ని చోట్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 1,299 గ్రామ పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు కాగా పనులు వివిధ దశల్లో ఉన్నట్లు సంబంధిత అధికార వర్గాలు అంటున్నాయి.



రాయికల్ మండలం చర్ల కొండాపూర్‌లో నత్తనడకన సాగుతున్న జీపీ భవన పనులు

● జిల్లాలో పంచాయతీ భవనాల మంజూరు ఇలా..

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 81 పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు అయ్యాయి. అధిక సంఖ్యలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ కొన్ని చోట్ల వివిధ కారణాల వల్ల పనులు ప్రారంభం కాలేదు. జిల్లాలో ఇప్పటి వరకు 42 చోట్ల జీపీ భవనాల పనులు ప్రారంభం కాలేదు. 38 చోట్ల గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. జిల్లాలోని మల్లాపూర్ మండలం సిర్‌పూర్ గ్రామంలో మాత్రమే పంచాయతీ భవన నిర్మాణం పూర్తయింది. కొన్ని చోట్ల భవనాల నిర్మాణానికి అనువైన స్థలం లభించకపోవడం, ఇంకొన్ని ప్రాంతాల్లో వివాదాలు చోటుచేసుకోవడం, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం తదితర కారణాల వల్ల అనేక చోట్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు అవసరమైన చర్యలు తీసుకొని గ్రామ పంచాయతీలకు సొంత గూడు కల్పించడానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తాం

-లక్ష్మణ్‌రావు, జగిత్యాల జిల్లా పంచాయతీరాజ్ ఈఈ



జిల్లాలో నిధులు మంజూరైన ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. జిల్లాకు 81 పంచాయతీ భవనాలు మంజూరు అయ్యాయి. ఇందులో ఇప్పటి వరకు పలు చోట్ల పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించాం. మిగిలిన భవ్మ నాల పనులు ప్రారంభించడంతో పాటు సాధ్యమైనంత తొందరలో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం.

వెలవెలబోయిన ఆలయాలు

- గ్రహణం నేపథ్యంలో పలు ఆలయాల మూసివేత
- నేడు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత తెరుచుకోనున్న ఆలయాలు



రాజన్న ఆలయాన్ని మూసివేస్తున్న ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు



ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ప్రధాన గేటు మూసివేసిన అర్చకులు, అధికారులు



కొండగట్టులో ద్వార బంధనం అనంతరం ఆలయం ఎదుట అర్చకులు, ఉద్యోగులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయం చంద్రగ్రహణం ఎఫెక్ట్‌తో ఆదివారం వెలవెలబోయింది. ఈవో రమాదేవి ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ ప్రధానద్వారాన్ని ఉదయం 11.36 గంటలకు మూసినట్లు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీస్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించి 11.35 గంటల వరకు దర్శనానికి భక్తులకు అనుమతినిచ్చారు. రాజన్న ఆలయంతో పాటుగా అనుబంధ ఆలయాలను సైతం మూసివేసినట్లు వెల్లడించారు. చంద్రగ్రహణం సందర్భంగా రాజన్న ఆలయం భక్తుల లేక వెలవెలబోయి క్యూలైన్‌లు బోసిపోయి కనిపించాయి. చంద్రగ్రహణం అనంతరం సోమవారం ఉదయం 3.45గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించి ఉదయం 7గంటలకు శ్రీస్వామివారి దర్శనానికి యథావిధిగా భక్తులను లోపలికి అనుమతినివ్వ నున్నట్లు పేర్కొన్నారు. రాత్రి9.56 గంటలకు ప్రారంభమయ్యే చంద్రగ్రహణం రాత్రి 1.26 గంటల వరకు ఉంటుందని, ఈసారి రాహుగ్రస్త చంద్రగ్రహణం సంభవించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు శరత్ తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయం మూసివేత..

ధర్మపురి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ధర్మపురిక్షేత్రంలోని లక్ష్మీనర సింహస్వామి, అనుబంధ ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. ఆలయ ప్రధాన గేటుకు తాళంవేసి ఆలయ ద్వార బంధనం చేశారు. తిరిగి సోమవారం ఉదయం 5గంటలకు తెరచి ఆలయాల్లో సంప్రోక్షణ, అభిషేకం, గ్రహణశాంతి అనంతరం 9.30గంటలకు భక్తులకు దర్శనాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

అంజన్న ఆలయం మూసివేత

మల్యాల: చంద్రగ్రహణం దృష్ట్యా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. స్వామి వారికి నివేదన అనంతరం దేవాలయ ద్వార బంధనం చేశారు. సోమవారం వేకువజామున ఆలయంలో పుణ్యాహవచనం, సంప్రోక్షణ, తిరు మంజనం, ఆరాధన పూజలు జరిపిన అనంతరం ఉదయం 7గంటల నుంచి ఆలయం తెరవనున్నట్లు ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు. అనంతరం యథావిధిగా దర్శనాలు, ఆర్జిత సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

కోటేశ్వరస్వామి ఆలయం మూసివేత

వెల్గటూర్: చంద్రగ్రహణం సందర్భంగా కోటిలింగాల పార్వతీ కోటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం అర్చకులు ద్వారబంధనం చేశారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ, గ్రహణ శాంతి హోమం, స్వామి వారికి అభిషేకం అనంతరం భక్తులకు స్వామి దర్శనం ఉంటుందని అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, డైరెక్టర్ గుమ్ముల వెంకటేష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ పాఠశాలలో ఈషా గ్రామోత్సవం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొనగా, రాచర్లగొల్లపల్లి విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. రూ.25 వేల నగదు బహుమతి సాధించిందని పేర్కొన్నారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికవడంపై పాఠశాల హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయులు, స్థానికులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఇల్లందకుంట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన నాగపూరి ప్రవీణ్ తన సెల్‌ఫోన్ హనుమకొండలో పోయిందని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్‌ను గుర్తించారు. రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను ఎస్ఐ క్రాంతికుమార్ ఆదివారం బాధితుడు ప్రవీణ్‌కు అందజేశారు.

అధ్వానంగా సాగునీటి కాల్వలు

- కాలువ మధ్యలో మట్టి, చెత్తకుప్పలు
- పట్టించుకోని అధికారులు



మక్తపల్లి వద్ద ఉన్న డీ4 కాలువ మధ్యలో పడేసి ఉన్న రాళ్లు, చెత్త

తిమ్మాపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్తపల్లి-పొలంపల్లి గ్రామాలకు వెళ్లే మార్గంలో ఉన్న డీ-4 కాలువ అధ్వానంగా తయారైంది. వేల ఎకరాలకు సాగు నీరు అందించే కాలువ అస్తవ్యస్తంగా మారింది. కాలువ మధ్యలో నీరు ప్రవహించకుండా మట్టి, రాళ్లు, చెత్తతో నిండిపోయింది. కాలువలో గడ్డి భారీగా పెరిగింది. మరోపక్క కాలువలో ఓ పెద్ద గేదె కళేబరం పడి ఉంది. దీంతో ఆ ప్రాంతంలో రోడ్డుపై వెళ్లేవారు ఈగలు ముసురుతున్నాయని, దుర్వాసన వస్తోందని పేర్కొంటు న్నారు. కాలువ ఇరువైపులా పిచ్చిమొక్కలతో నిండి పోయింది. కాలువను పట్టించుకున్న వారే లేరని అటుగా వెళ్లే ప్రయాణికులు, రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో ఉన్న మట్టి, చెత్తను, గేదె కళే బరాన్ని తొలగించి కాలవను నీటి ప్రవాహానికి అను కూలంగా శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.

మానకొండూర్: మండలంలోని డీబీఎం-2 ఉపకాల్వ సదాశివపల్లి నుంచి డీబీఎం-7 ఉపకాల్వ కొండపల్కల వరకు పంట పొలాలకు సాగు నీరందిస్తుంది. ఎస్సారెస్పీ ఉపకాల్వలలో వివిధ రకాల చెట్లు మొలిచి కాల్వలు కనబడకుండా పెగిగిపోయాయి. మానకొండూర్ నుంచి లింగాపూర్ వరకు నీటిసరఫరా చేసే డీబీఎం-3 ఉపకాల్వ సైతం మొత్తం చెట్లతో నిండిపోయింది. మండలంలోని మిగతా ఉపకాల్వల్లో సైతం చెట్లు మొలిచి దర్శనమిస్తున్నాయి. కాల్వల్లో చెట్లు ఉండడంతో ఇటీవల కురిసిన వర్షం నీరు కాల్వల్లో ప్రవహించకుండా గట్టుపై నుంచి వెళ్లిపోయాయి. ఇక ఉపకాల్వల ద్వారా నీటిని సరఫరా చేస్తే పంట పొలాలకు నీరు ఎలా వెలుతుందో అధికారులకే తెలియాలి.



మానకొండూర్‌లోని డీబీఎం 3 ఉపకాల్వలో మొలిచిన చెట్లు

బాలికల ఆత్మరక్షణకు కుంగ్‌ఫూ దోహదం

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ● రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాలికల ఆత్మరక్షణకు కుంగ్‌ఫూ క్రీడ దోహదపడుతుందని సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఆదివారం మూడో తెలంగాణ రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను ఇంటర్నేషనల్ షావలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 18 జిల్లాల నుంచి 1,000 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక పటుత్వానికి క్రీడలు తప్పనిసరి అన్నారు. క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి, వికాసం జరుగుతాయని, తద్వారా విద్యార్థులు చదువులోనూ ముందుంటారన్నారు. జిల్లాలో నిర్వహించే క్రీడలకు సుడా ఆధ్వర్యంలో తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. వచ్చే సంవత్సరం జాతీయస్థాయి కుంగ్‌ఫూ పోటీల నిర్వహణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీపీ నిరంజనాచారి, వాగ్దేవి డిగ్రీ కళాశాల చైర్మన్ గోవింద వరం కృష్ణ, పోటీల చీఫ్ ఆర్గనైజర్ ఎలగందుల శ్రీనివాస్, కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సభ్యులు, జిల్లా ఉప సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బార విద్యాసాగర్, శేఖర్, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన పరంధాములు అనేవ్యక్తి మూడు రోజుల కిందట పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడు. మూడునెలల కిందట పరంధాములుపై కరీంనగర్ రూరల్ పోలీసుఠాణాలో కేసు నమోదైంది. అదే గ్రామానికి చెందిన ఒక మాజీ ప్రజాప్రతినిధికి పరంధాములు మధ్య విభేదాల కారణంగానే ఆయన ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. పరంధాములు ఆత్మహత్యాయత్నంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

● 12,500 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టుగేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. ఎనిమిదిగేట్లు ఎత్తి 12,500క్యూసెక్కులనీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. కాగా ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వఉంది. ఇందులో వరద కాలువకు 19వేలక్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500క్యూసెక్కులు, ఎస్కేప్‌గేట్ల ద్వారా గోదావరిలోకి 2,500క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు నీరువదలగా 684క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

నిండుకుండలా అన్నపూర్ణ రిజర్వాయర్..


ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతుండటంతో నిండుకుండలా మారింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం రెండు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తుండగా 3.29టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయక సాగర్‌కు 6600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) ప్రాజెక్టు ఆదివారం 13వేల ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీనుంచి వరదకాలువ ద్వారా 13వేలక్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. కాగా ప్యాకేజీ10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.66ఉండగా, నిలువసామర్థ్యం27.55 టీఎంసీలకు 26.68టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎల్ఎండీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో..

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఎగువ నుంచి వస్తున్న ఇన్ఫ్లో తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ఎగువన కాకతీయ కాలువ నుంచి 900క్యూసెక్కులు, మోయతుమ్మెద వాగు నుంచి 550క్యూసెక్కులు మొత్తం 1450క్యూసెక్కులు వస్తుండగా, కాకతీయ కాలువ ద్వారా దిగువకు 3వేల క్యూసెక్కుల విడుదల కొనసాగుతోంది. మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 305క్యూసెక్కులు మొత్తం 3305 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ఆదివారం రాత్రి 22.665 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



నీటితో కళకళలాడుతున్న అన్నపూర్ణ రిజర్వాయర్

మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాజన్న

మంథని, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు మంథని నియోజకవర్గ ఇన్‌చార్జిగా కాటారంకు చెందిన కందుగుల రాజన్నను జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నియమించారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో నియామకపు పత్రాన్ని రాజన్న ఆదివారం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సంఘాన్ని బలోపేతం చేసి మాలల హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. అప్పాల పోచమల్లయ్య, నూకల శంకర్, జంజర్ల రాజు, ఎరుకల ప్రవీణ్, లింగాల సురేష్, బండి రాజయ్య, కొప్పూరి రాజలింగు, బొడ్డెల రవి, ఆర్ల జ్ఞాని, జంజర్ల శ్రీనివాస్, దీకొండ లక్ష్మణ్, ఆర్ల సందీప్, నవ రమేష్, రావుల మొగిలి, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కమాన్‌పూర్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయలేదని, పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వీరపల్లి గ్రామంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలని ఆయన పిలుపునిచ్చారు. బొమ్మగాని అనిల్, మేకల సంపత్ యాదవ్, కొట్టె భూమయ్య, కొండ వెంకటేష్, పోలుదాసరి సాయికుమార్, రాచకొండ చంద్రమౌళి, ఆకుల కుమార్, రవి, పెండ్లి నారాయణ, ఎరుకల నంబయ్య, పల్లె నారాయణ, కొయ్యడ కుమార్, తోడేటి రాజీరు, బోగే తిరుపతి, పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపరిచిన నాస్తిక్ వెంకన్న

కమాన్‌పూర్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మానవ వికాస కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు నాస్తిక్ వెంకన్న అలియాస్ సుంకరి వెంకటస్వామి వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులతోపాటు పలు సంఘాల నాయకులు, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకన్న మూఢనమ్మకాలపై పలు పోరాటాలు చేసి, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు. ప్రజల మదిలో నిలిచిపోయిన గొప్ప కళాకారుడని, అలాంటి వారు అరుదుగా లభిస్తారని అన్నారు. అతని జీవిత నేపథ్యాన్ని తెలియజేసే పాటలను కళాకారులు ఆలపించారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం



స్వీట్లు పంచుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనారం నుంచి పెద్దరాత్‌పల్లికి ఎమ్మెల్యే విజయరమణారావు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం కూనారం గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులతో కలిసి బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ మాట్లాడుతూ కూనారం, పెద్దరాత్‌పల్లి గ్రామానికి బీటీ రోడ్డు ఎన్నో ఏళ్ల కల అన్నారు. ఎమ్మెల్యే నేతృత్వంలో ప్రజల కల నెరవేరుతున్నట్లు ఆయన తెలిపారు. మంథని, ముత్తారం మండలాలతోపాటు పెద్దరాత్‌పల్లి, ఎదులాపూర్ గ్రామాల ప్రజలకు పెద్దపల్లికి వెళ్లడానికి దూర భారం తగ్గుతుందన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ సర్పంచ్‌లు డొంకెన విజయ మొగిలి, మాదాసి సతీష్, ఓరుగంటి కొమురయ్య, మాజీ ఎంపీటీసీ రాజేశ్వరి కొమురయ్య, నాయకులు పెండెం శ్రీనివాస్, కుంభం కుమార్, కాంపల్లి శ్రీకాంత్, గొర్ల శ్రీనివాస్, కలవేన రమేష్, వెల్మూరి రమేష్, శ్రావణ్, ముస్కు కుమార్, మల్లయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

మృతుడి నేత్రాల సేకరణ

ఓదెల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ముష్కుల మాధవరెడ్డి అనే వృద్ధుడు మృతిచెందగా ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మచారి మాట్లాడుతూ మృతి చెందినప్పటికి వారి నేత్రాలు సజీవంగా ఉంటాయన్నారు. ప్రచార కార్యదర్శి వాసు, మండల అధ్యక్షుడు కొండ్ర వేణు, వెంకటేశ్వర్లు, సారంగం, సతీష్, మల్లేశం పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మాజీ జడ్పీటీసీ బండారి రామ్మూర్తి తండ్రి రామస్వామి మృతిచెందాడు. ఆదివారం స్వగ్రామమైన చీకురాయిలో కాల్వశ్రీరాంపూర్ మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

10న రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు

రామగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్ని విద్యాసంస్థల్లో 8వ తరగతి నుంచి డిగ్రీ స్థాయి విద్యార్థులకు శ్రీ సత్యసాయి రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలను ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కన్వీనర్ నూక రమేష్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృతజ్ఞత- పరిపూర్ణ జీవనమునకు మార్గం అనే అంశం పై వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ముగ్గురు విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి వచ్చిన వారికి స్వర్ణ పతకం అందించనున్నట్లు తెలిపారు.

బ్యాలెట్ ఓటింగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సొంత ఇంటి పథకం అమలుపై కార్మికుల అభిప్రాయ సేకరణ కోసం చేపట్టిన బ్యాలెట్ ఓటింగ్ కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం నాయకులు ఆవిష్కరించారు. ఓసీపీ-3 కృషిభవన్, సీహెచ్‌పీలలో జరిగిన కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి కుంట ప్రవీణ్ మాట్లాడారు. నాలుగేళ్ళుగా కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని సీఐటీయూ వివిధ రూపాల్లో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో అన్ని యూనియన్లు సొంత ఇంటి పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చాయని, గెలిచిన సంఘాలు ఆదిశగా కృషి చేయడం లేదని ప్రవీణ్ పేర్కొన్నారు. సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం లేకుండానే సొంత ఇంటి పథకం అమలు సాధ్యమని తెలిపారు. సొంత ఇంటి పథకం అమలు అంశంలో కార్మికుల అభిప్రాయాలను తెలిపేందుకే బ్యాలెట్ ఓటింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 11,12 తేదీల్లో సింగరేణి వ్యాప్తంగా జరిగే ఓటింగ్‌లో కార్మికులు పాల్గొనాలని కోరారు. ఉల్లి మొగిలి, ఎస్ వెంకన్న, వినేష్, సంపత్, సాంబరావు, లక్ష్మీరాజం, రాజేందర్, వెంకటనర్సయ్య, సంతోష్, మహేందర్, తిరుపతి పాల్గొన్నారు.

డివిజన్‌లో మహిళా ఓటర్లదే ఆధిపత్యం

- నాలుగు మండలాల్లో పురుషుల కంటే అధికం
- మొత్తం 1,10,894 మంది ఓటర్లు
- 56,478 మహిళలు, 54,410 పురుష ఓటర్లు, ఆరుగురు ఇతరులు
- పురుషుల కంటే 2,068 మంది మహిళ ఓటర్లు ఎక్కువ

మంథని, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంథని డివిజన్‌లో మహిళ ఓటర్ల అధికంగా ఉన్నారు. మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాలు మంథని డివిజన్‌లో ఉన్నాయి. స్థానిక సంస్థ ఎన్నికల కోసం ఈసీ ఆదేశాల మేరకు 4 మండలాల్లో అధికార యంత్రాంగం ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. నాలుగు మండలాల్లో పురుషుల కంటే మహిళ ఓటర్ల అధికంగా ఉన్నారు. వార్డులు, గ్రామాల వారీగా ఓటర్ల జాబితాను ఫైనల్ చేసి గ్రామ పంచాయతీలు, ఎంపీడీవో కార్యాలయాల నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ఇదే తరహాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ఈనెల 10న ఫైనల్ కానుంది. 10న ఓటర్ లిస్టు ఎలాంటి మార్పు ఉండే అవకాశం లేదు.

డివిజన్‌లో మొత్తం 1,10,894 మంది ఓటర్లు ఉండగా వారిలో 56,478 మంది మహిళ ఓటర్లు, 54,410 మంది పురుష ఓటర్లు, 6 ఇతరులు ఉన్నారు. నాలుగు మండలాల్లో పురుషుల కంటే 2,068 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు.

● మంథని మండలంలో 35 గ్రామ పంచాయ తీలు, 282 వార్డులు ఉండగా వాటిలో 282 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 34,973 మంది ఉండగా వారిలో మహిళలు 17,929 మంది, పురుషులు 17,040 మంది, ఇతరులు 4 ఉన్నారు. మండలంలో పురుషుల కంటే 889 మంది మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు.

● కమాన్‌పూర్ మండలంలో 9 గ్రామ పంచాయతీలు, 92 వార్డులు ఉండగా వాటిలో 92 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 20,145 మంది ఉండగా వారిలో మహిళలు 10,270 మంది, పురుషులు 9,875 మంది ఉన్నారు. మండలంలో పురుషుల కంటే 395 మంది మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద బార్లు తీరిన మహిళ ఓటర్ల (ఫైల్)

● రామగిరి మండలంలో 16 గ్రామ పంచాయతీలు, 158 వార్డులు ఉండగా వాటిలో 158 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 32,574 మంది ఉండగా వారిలో మహిళలు 16,406 మంది, పురుషులు 16,167 మంది, ఇతరులు 1 ఉన్నారు. మండలంలో పురుషుల కంటే 239 మంది మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు.

● ముత్తారం మండలంలో 15 గ్రామ పంచాయతీలు, 138 వార్డులు ఉండగా వాటిలో 138 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 23,197 మంది ఉండగా మహిళలు 11,868 మంది, పురుషులు 11,328 మంది, ఇతరులు 1 ఉన్నారు. మండలంలో పురుషుల కంటే 540 మంది మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జరిగే సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ, నిర్వహణ ఏర్పాట్లపై వార్డు, గ్రామ పంచాయతీల వారిగా అధికారులు కసరత్తు పూర్తి చేశారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొననుంది. గ్రామాల్లో అశావాహులు ఓటర్ల ప్రసన్నం కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలి

మైదానం చదును లేక క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు



పేరు అగుపించకుండా ఉన్న కళాశాల బోర్డు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలలోకి పశువులు, గొర్లు, మేకలు వస్తున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు. పశువుల కాపరులు కళాశాల మైదానంలో మేపుతున్నట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. మండల కేంద్రంలోని పాండవుల గట్టు ప్రాంతంలోని 597 సర్వే నెంబర్‌లో 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలం కళాశాల నిర్మాణానికి కేటాయించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసినా, చుట్టు ప్రహరీ నిర్మాణం చేయలేదు. అలాగే విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలం కూడా సరిగా లేదు. ఎత్తుపల్లాలుగా, ఎగుడు దిగుడుగా ఉండటంతో విద్యార్థులు ఆటలు ఆడేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన కాలంలో ఎన్నిమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని విద్యార్థులు, ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కొండ ప్రాంతం కావడంతో మందు బాబులకు అడ్డాగా మారింది.



ప్రహరీ లేని ప్రభుత్వ జూనియర్ కళాశాల

నిత్యం రాత్రి సమయాల్లో మద్యం తాగి, వాటిని పగులగొట్టి అక్కడే పడవేస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. దీంతో విద్యార్థులు గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. క్రీడా వసతి సరిగా లేకపోవడం వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాల మైదానమంతా ముళ్లకంపలతో పిచ్చిమొక్కలతో ఎత్తువంపులుగా ఉండటం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ప్రహరీ లేకపోవడంతో కబ్జాకు చేసుకునేందుకు యత్నిస్తున్నారు. కబ్జాపై గ్రామస్థులు, ప్రిన్సిపాల్, పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన దాఖలాలు ఉన్నాయి. విశాలంగా మైదానం ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాల బోర్డు కూడా నామరూపాలు లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి కళాశాల మైదానంలోని పిచ్చిమొక్కలు తొలగించి, మైదానాన్ని చదును చేయించాలని, అలాగే ప్రహరీ నిర్మించాలని విద్యార్థులతోపాటు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కోరుతున్నారు.

మానేరు, గోదావరిలో ఇసుక లభ్యతపై సర్వే..

(5వ పేజీ తరువాయి)

కూడా మంగళం పాడారు. మానేరు, గోదావరి నదుల నుంచి జిల్లా అవసరాలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచితంగా ఇసుక తీసుక వెళ్లేందుకు ట్రాక్టర్ల యజమానులకు అనుమతించారు. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు ఇసుకను తరలించుకుని, అక్కడి నుంచి హైదరాబాద్‌కు లారీల ద్వారా గుట్టుచప్పుడుగా తర లించి సొమ్ము చేసుకుంటున్నారు. గత ఏడాది కాలంగా జిల్లాలో ఉన్న మానేరు, గోదావరి నదుల నుంచి ఇసుక ఉచితంగానే తరలుతున్నది. తద్వారా ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఆదాయం రావడం లేదు. తాజాగా జిల్లాలో గల రెండు నదులపై ఇసుక లభ్యతపై సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పక్కాగా పర్యావరణ అనుతులు లభించిన క్వారీలనే లీజుకు ఇచ్చేందుకు గుర్తించాలని ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశిం చింది. ఎవరు కూడా కోర్టులను ఆశ్రయించే పరిస్థితి తలెత్తకుండా క్వారీలను గుర్తించాలన్నారు. గుర్తించిన ఇసుక క్వారీలను టీజీఎస్ఎండీసీ ద్వారానే నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది.

అతిథి మహిళా అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి మాలతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ -2 బోధించడానికి రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ, పీజీ ఉత్తీర్ణత శాతం, బోధన అనుభవం, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాలలో, 7995010675 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లభించని రాజేష్ యాదవ్ ఆచూకీ

- రెండురోజులుగా గాలిస్తున్న మత్స్యకారులు
- తీరప్రాంత గ్రామాలను అప్రమత్తం చేసిన పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గణపతి నిమజ్జనం సందర్భంగా ఈ నెల 6వ తేదిన గోదావరిఖని గోదావరి వంతెన పై నుంచి గోదావరిలో పడి గల్లంతైన రామగుండం పట్టణానికి చెందిన రాజేష్ యాదవ్(22) అనే యువకుడి ఆచూకీ లభించలేదు. రెండు రోజులుగా మత్స్యకారులు గోదావరిఖని నుంచి సుందిళ్ల వరకు గోదావరిలో గాలిస్తున్నారు. ఆదివారం గోదావరిలో నీటి ప్రవాహం తగ్గడంతో నదిలో నీటి మడుగులు ఉండే ప్రాంతాల్లో సైతం విస్తృతంగా గాలింపు చేస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో నదిలో 1.2లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండడంతో రాజేష్ యాదవ్ సుందిళ్ల బ్యారేజీ కొట్టుకుపోయాడనే కోణంలో కూడా పోలీసులు ఆలోచన చేస్తున్నారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు, గోదావరి తీర ప్రాంత గ్రామాలకు చెందిన కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లను అప్రమత్తం చేశారు. రాజేష్ యాదవ్ క్షేమంగా ఉండాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు. ఆదివారం రాత్రి వరకు కూడా రాజేష్‌యాదవ్ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు వర్గాలు సైతం ఆందోళనకు గురవుతున్నాయి. సుందిళ్ల బ్యారేజీ దిగువన మానేరు నది కూడా గోదావరిలో కలుస్తుండడంతో ప్రవాహ వేగం ఎక్కువగా ఉంటుందని, సుందిళ్ల బ్యారేజీ లోపు ఎక్కడైనా చిక్కుకుంటే ఆచూకీ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 4గంటల నుంచే గాలింపు చేసేలా మరింత మంది మత్స్యకారులను పోలీసులు రంగంలోకి దించుతున్నారు. ఎల్లంపల్లి నుంచి కేవలం 1200క్యూసెక్కుల నీటిని వదులుతుండడంతో నదిలో ప్రవాహం తగ్గిపోయింది. గోదావరిఖని నుంచి ఏటూరు నాగారం వరకు ఎక్కడైనా రాజేష్ ఆచూకీ లభించే అవకాశం ఉందనే కోణంలో పోలీసులు మూడు జిల్లాల యంత్రాంగాలతో సంప్రదిస్తున్నారు.

యోగాను ఒలింపిక్స్‌లో చేర్చాలి

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యోగాను ఒలింపిక్స్‌లో చేర్చాలని యోగా అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగాసన పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభచాటారు. ముగింపు సమావేశానికి యోగా అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో యోగాను చేర్పితే భారత్ ఎక్కువ స్వర్ణ పతకాలు సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్య క్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, యోగా కోచ్‌లు వి కిష్టయ్య, పి మల్లీశ్వరి, జి రామకృష్ణ, సాగర్, కె అశోక్, ఆనంద్ కిశోర్, ప్రశాంత్, కోటేశ్వర్ రావు, స్వరూపచారి, స్నేహలత, ఆమని పాల్గొన్నారు.



జిల్లాస్థాయి విజేతలతో అతిథులు

ఆసుపత్రి గుర్తింపును రద్దు చేయాలి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఓ యువతిపై మత్తుమందు ఇచ్చి కాంపౌండర్ లైంగికదాడి చేయడం దారుణమని వెంటనే ఆసుపత్రి గుర్తింపును రద్దు చేయాలని కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకుని, పరారీలో ఉన్న డాక్టర్‌పై కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్(బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేష్ డిమాండ్ చేశారు.

సింగరేణిలో క్రీడలపై చిన్నచూపు

- డ్రెస్సులు ఇవ్వరు.. బూట్లు రావు..
- మూడేళ్లుగా అందని క్రీడా కిట్లు
- ఇబ్బందులకు గురవుతున్న ఆటగాళ్లు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్ని సంస్థల్లో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండగా, సింగరేణిలో మాత్రం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. బడ్జెట్ కేటాయిస్తున్నా క్రీడా దుస్తులు, కిట్లు అందడం లేదు. ఫలితంగా ప్రాక్టీస్ చేసుకునేందుకు క్రీడాకారులు తమ సొంత ఖర్చులతో మెటీరియల్ కొనుగోలు చేస్తున్నారు. కోల్ ఇండియా స్థాయిలో విజయాలు సాధిస్తున్నా యాజమాన్యం నుంచి ప్రోత్సాహం కరువైంది.కబడ్డీ, హాకీ, క్రికెట్, పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్, క్యారమ్స్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బా స్కెట్ బాల్, తదితర క్రీడాంశాలలో ఆటల పోటీలు జరుగుతాయి. ఆయా అంశాల్లో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు కలిపి రెండు వేలకు పైగా క్రీడా కారులు ఉన్నారు. వీరిలో చాలా మంది ఏరియా స్థాయి, కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలో ఆడుతున్నారు. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడ ల్స్, ఇతర బహుమతులు కూడా పొందిన వారు చాలా మంది ఉన్నారు. కొన్నేళ్లుగా ఉన్న సీనియర్ క్రీడాకారులతో పాటు కారుణ్య నియామకాల ద్వారా వచ్చిన యువ క్రీడాకారులు ప్రతిభ చూపుతున్నారు.

యాజమాన్యం నుంచి..

మూడు సంవత్సరాలుగా సింగరేణి యాజమాన్యం నుంచి ఒక్కటే మాట వినిపిస్తోంది. క్రీడాదుస్తులు, కిట్లు వస్తాయని. కానీ ఇంతవరకు వాటిని పంపిన పాపాన పోలేదు. 55 లక్షల రూపాయలు క్రీడా సామగ్రి కొనుగోలు చేసేందుకు యాజమా న్యం నుంచి డబ్బులు విడుదల య్యాయి. అయినా కొనుగోళ్లు మాత్రం జరగడం లేదు. క్రీడా సమగ్రి కొనుగోలు చేసేందుకు కార్పొరే ట్ స్థాయిలో పర్చేజ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు కొనుగోలు చేసేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్లి కొటేషన్లు తీసుకుంటారు. కానీ ఏ వస్తువూ కొన్న పాపాన పోవడంలేదు. గతంలో కొన్న సామగ్రిలో కేవలం 60 శాతం మాత్రమే 11 ఏరియాలకు అందజేశారు. మిగిలినవి గోదాంలో మగ్గిపోతున్నాయి. వాటిలో కొన్ని పనికిరాకుండా పోయాయని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో హాకీ ఆడుతున్న ఆటగాళ్లు(ఫైల్)

సొంత ఖర్చులతో..

నిత్యం ప్రాక్టీస్ చేసేందుకు కంపెనీ ద్వారా సరఫరా అయిన డ్రెస్సులు, బూట్లు, కిట్లు అందుబాటులో లేకపోవడంతో క్రీడాకారులు తమ సొంత ఖర్చులతో వాటిని సమకూ ర్చుకుంటున్నారు. ఓ వైపు క్రీడా సామగ్రి ఇవ్వకపోగా మరోవైపు వారికి ఇతర సంస్థల్లోని క్రీడాకారుల మాదిరిగా వసతులు, వెసులుబాట్లు కల్పించడం లేదని సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది క్రీడాకారులు నివాసం ఉండే క్వార్టర్లు స్టేడియాలు, ఆట స్థలాలకు దూరంగా ఉన్నాయి. అలా కాకుండా వారికి స్టేడియాలకు సమీపంలో ఉండే క్వార్టర్లు కేటాయిస్తే సౌకర్యంగా ఉంటుంది. అలాగే కొందరు తమ కుటుంబాలకు దూరంగా విధులు నిర్వర్తిస్తూ క్రీడల్లో పాల్గొంటున్నారు. అలాంటి వారికి వారు కోరుకున్న ప్రాంతాలకు బది లీ చేసి కుటుంబాలతో ఉండేటట్లు చూడవచ్చు. దీని వల్ల తమ విధులకు ఆటంకం కలుగకుండా ఆటల పోటీల్లోనే విరివిగా పాల్గొంటారు. ఇవి యాజమా న్యం ఎలాంటి ఖర్చు లేకుండా చేయగలిగిన పను లు. కానీ మనది బొగ్గు వెలికితీసే సంస్థ అవన్నీ వీలు కావండీ అంటూ అధికారులు సీనియర్ల నుంచి వచ్చే సూచనలను తోసిపుచ్చుతున్నారు. ఏదైనా క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లిన క్రీడాకారులకు ఆన్‌డ్యూటీ(ఓడీ) సౌకర్యం ఇస్తున్నప్పటికీ అరకొరగా ఉంటున్నాయని క్రీడాకారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోగాని, ఇతర రాష్ట్రాల్లోగాని ఆడేందుకు వెళ్లి నప్పుడు పోవడానికి, రావడానికి, ఆడిన రోజులకు మాత్రమే ఓడీ ఇస్తుం డగా, పోటీల నుంచి రాగానే విశ్రాంతి తీసుకోవ డానికి అవకాశం లేకుండా పోతోందని వాపోతు న్నా రు. అదనంగా ఒకటి, రెండు రోజులు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. సింగరేణిలోని 11 ఏరియాల్లో స్పోర్ట్స్ సూపర్‌వై జర్లు క్రీడలను, క్రీడాకారులను సమన్వ యపరుస్తు న్నారు. సమాచారం, శిక్షణ, తదితర అంశాల్లో చేదో డువాదోడుగా ఉంటున్నారు. అయితే ఇప్పటి వరకు ఉన్న సూపర్‌వైజర్లలో మూడు ఏరియాలకు చెందిన ముగ్గురు రిటైర్ కాగా, వారి స్థానంలో ఎవరినీ నియమించలేదు. 2026లో ఇద్దరు, 2027లో ముగ్గురు రిటైర్ కానున్నారు. ఒక్కరికి తొమ్మిదేళ్లపాటు సర్వీసు ఉండడంతో ఆయన ఎక్కువ రోజులు సేవలు అందించే అవకాశం ఉంది.